### డబుల్ లబ్ధిదారుల జాబితాలో

## అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి



భీమయ్యగౌడ్, తహసీల్దార్, మారేడ్‌పల్లి.

అడ్డగుట్ట, మే 29: ఓల్డ్ మారేడుపల్లి లోని డబుల్ బెడ్రూం ఇండ్ల జాబితాలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తెలియ జేయాలని మారేడుపల్లి మండల తహసీల్దార్ భీమయ్యగౌడ్ కోరారు. గురువారం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లకు సంబంధించిన 148 మందితో కూడిన లబ్ధిదారుల జాబితాను గురువారం విడుదల చేశారు. ఆ జాబితాకు సంబంధించి ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తమకు తెలియజేయాలని ఆయన సూచించారు. సదరు జాబితాను జీహెచ్‌ఎంసీ, మారేడ్‌పల్లి తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలు, తుకారంగేట్, మారేడ్‌పల్లి పోలీస్‌స్టేషన్ల ఎదురుగా అతికించినట్లు తెలిపారు. వారంలోపు ఆ జాబితాపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తమను సంప్రదించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.


## భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి

మియాపూర్, మే 29: చందానగర్ సర్కిల్ పరిధిలో ఓ అక్రమ నిర్మాణ భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి చెందాడు. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకాం సర్కిల్ పరిధి, హఫీజ్ పేట డివిజన్, మదీనాగూడలోని ఓ అక్రమ నిర్మాణ భవనంలో గురువారం పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఓ కార్మికుడు గోవా కర్రలు కూలి లిఫ్ట్ గుంతలో పడి మృతి చెందాడు. ఈ ఘటనపై జీహెచ్‌ఎంసీ చందానగర్ సర్కిల్ అధికారులు సదరు భవన యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని మియాపూర్ పోలీసులకు లేఖ రాశారు. కార్మికుడి బంధువులు సైతం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

# ప్రత్యేక హోదా కల్పించాలి

- సికింద్రాబాద్ ప్రాంతానికి ప్రాధాన్యత ఏదీ?

**లష్కర్ జిల్లా సాధన సమితి నాయకులు**



సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖను చూపిస్తున్న లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు

సికింద్రాబాద్, మే 29: సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి లష్కర్ జిల్లా సాధన సమితి నేతలు గురువారం లేఖ రాశారు. సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్, కమిటీ సభ్యులు సీఎంకు లేఖను రిజిస్టర్ పోస్ట్ చేశారు.

### ఇక్కడి నిధులు అక్కడికి...

1959వరకు ప్రత్యేక కార్పొరేషన్‌గా కొనసాగిన సికింద్రాబాద్‌ను 1960లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేశార, అప్పటి నుంచి ఇక్కడ వసూలైన నిధులు మరో ప్రాంతానికి తరలిపోవడం ప్రారంభమైందని చెప్పారు. ఇక జీహెచ్‌ఎంసీగా ఆవిర్భవించిన తర్వాత ప్రభుత్వం ఎన్ని నిధులు కేటాయించినా అభివృద్ధి చెందుతున్న గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, హైటెక్‌సిటీ ప్రాంతాలకే మేలు జరుగుతుందని అన్నారు. ఈ విషయం సికింద్రాబాద్ ప్రాంత ప్రజలను తీవ్ర మనస్తాపనికి గురి చేస్తోందని తెలిపారు. ఈ పరిణామాలు చూస్తుంటే సికింద్రాబాద్ మరో పాత నగరంగా మిగిలిపోతుందనే ఆందోళన ఇక్కడి ప్రజాల్లో నెలకొందని తెలిపారు.

### సికింద్రాబాద్ ప్రాంతంపై చిన్న చూపు..

రోడ్ల విస్తరణ, నూతన ఫ్లైఓవర్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచక పోవడం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం లాంటి చర్యలు స్థానికుల జీవన ప్రమాణాలపై ప్రభావం చూపుతున్నదని అన్నారు. 2006లో సికింద్రాబాద్‌కు 200 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అప్పటి సీఎం వైస్‌ఆర్ ప్రకటించిన రూ.200కోట్ల నిధుల విడుదల కూడా ఆయన మరణంతో మరుగున పడిందని గుర్తు చేశారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరానికి ఎన్ని నిధులు కేటాయిస్తున్నా అవి సికింద్రాబాద్ ప్రాంత ప్రజలకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యూచర్ సిటీ ఏర్పాటు, శివారు మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో కలపడం లాంటి చర్యలు సైతం ఇక్కడి ప్రజలను మరింత ఆందోళనకు గురిచేసే అంశమని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్థానికుల కోరిక మేరకు సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రత్యేక హోదా కేటాయించాలని, అంతేగాకుండా ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించి సికింద్రాబాద్ ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నట్లు లేఖలో కోరారు.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగను జరుపుకోవాలి

### సమావేశంలో చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతన్న చిక్కడపల్లి ఏసీపీ ఎన్.రమేష్‌కుమార్

కవాడిగూడ, మే 29: భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా బక్రీద్ పండుగ జరుపుకోవాలని చిక్కడపల్లి ఏసీపీ ఎన్.రమేష్‌కుమార్ అన్నారు. జీవ వ్యర్థాలను రోడ్లపై వేయరాదని, ఎద్దుల ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేయరాదని ఆయన సూచించారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.రాంబాబు ఆధ్వర్యంలో గురువారం ముషీరాబాద్ పీఎస్ పరిధిలోని బక్రీద్ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్ హాజరై మాట్లాడారు. త్యాగానికి ప్రతిరూపంగా జరుపుకునే బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా వ్యర్థాలను రోడ్లపై వేయకుండా ప్లాస్టిక్ కవర్లలో వేసి జీహెచ్‌ఎంసీ స్వచ్ఛ ఆటోల్లో వేయాలని సూచించారు. పశువుల చర్మాలను శుద్ధి చేసే సందర్భంగా వెలువడే వ్యర్థాలను రోడ్లపైకి రాకుండా చూడాలని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇతర వర్గాల మనోభావాలు దెబ్బతినకుండా పండుగను జరుపుకోవాలని కోరారు. ముషీరాబాద్ సర్కిల్ ఇనస్పెక్టర్ జి.రాంబాబు మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్టంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అన్ని విభాగాల అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, ఎస్ఐలు లక్ష్మినారాయణ, ప్రసాద్‌రెడ్డి, పీస్ కమిటీ, మైనార్టీ నాయకులు షరీఫ్ హుస్సేన్, అక్తర్ అలీ, అక్లాక్ హుస్సేన్, ఎండీ మోహిన్, మసూద్, ఎజాజ్ హుస్సేన్, మహ్మద్‌గౌడ్, జావేద్‌ఖాన్, మహ్మద్ అలీ, శంకర్‌గౌడ్, ముతవలీ నజీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

శామీర్‌పేట్, మే 29: శామీర్ పేట్ చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. శామీర్ పేట్ చెరువులో సుమారు 30 ఏండ్ల వయస్సు గల గుర్తుతెలియని యువకుడి మృతదేహం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. మృతుడి ఒంటిపై అండర్వేర్ మాత్రమే ఉందని, మూడు –నాలుగు రోజులుగా నీటిపై తెలియాడుతూ కుళ్లిపోయే పరిస్థితిలో ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సకాలంలో దరఖాస్తులు అందజేయాలి



మీసేవ నిర్వాహకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ భీమయ్యగౌడ్

అడ్డగుట్ట, మే 29: దరఖాస్తుదారులు అందించిన ఫారాలను మీసేవా నిర్వాహకులు సకాలంలో తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని మారేడ్‌పల్లి మండల తహసీల్దార్ భీమయ్యగౌడ్ సూచించారు. గురువారం మండల కార్యాలయంలో మీసేవా నిర్వాహకులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధ్రువీకరణ పత్రాల నిమిత్తం మీసేవ కేంద్రానికి వచ్చే దరఖాస్తుదారుల నుంచి సంబంధిత సర్టిఫికెట్లకు అన్ని ఆధారాలను జతపరిచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. అనంతరం సదరు ఫారాలను వెంటనే సంబంధిత మండల కార్యాలయంలో అందజేయాలని ఆయన తెలిపారు. సర్టిఫికెట్లు నిర్ధారించిన తర్వాతనే దరఖాస్తు చేయడం ద్వారా ఎంక్వయిరీ సులభతరం అవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజునాయక్, సీనియర్ అసిస్టెంట్ మోహన్, స్పెషల్ ఆర్ఐ కృతిక, మీసేవా నిర్వాహకులు దేవేందర్, కుమార్ వంశీ, సంతోష్ , తదితరులు పాల్గొన్నారు.



## పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ కొడుకు శివ అభిషేక్‌రావు, కోడలు దివ్య చేతుల మీదుగా గురువారం పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు. వారిని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు. *– కేపీహెచ్‌బీ కాలనీ, మే 29*

## జపాన్ పరిశోధనకు హెచ్‌సీయూ ప్రొఫెసర్ వైదీశ్వరన్

కొండాపూర్, మే 29: జపాన్‌లోని ది నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెటీరియల్స్ సైన్స్ (ఎన్ఐఎంఎస్)లో జరిగే పరిశోధన పర్యటనకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జీఎస్ వైదీశ్వరన్ ఎంపికయ్యారు. వర్సిటీలో స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఆయన మెటీరియల్స్ సైన్స్‌లో అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా మెటీరియల్స్ నానో ఆర్కిటెక్టానిక్స్ (ఏంఏఎన్ఏ) స్కీమ్ కింద జపాన్ పరిశోధన పర్యటనకు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. ఈ పర్యటన జనవరి 13, 2026 నుంచి ఫిబ్రవరి 20 వరకు కొనసాగుతుందన్నారు. వైదీశ్వరన్ పరిశోధనలతో పాటు నిమ్స్ వర్సిటీతో స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ విభాగానికి చెందిన విద్యార్థుల మాస్టర్స్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్ పరస్పర ఎక్సేంజ్, కొలాబరేషన్లకు మెరుగైన అవకాశాలు పెరుగుతాయన్నారు.

## భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి



మారేడ్‌పల్లి తహసీల్దార్ భీమయ్యగౌడ్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

అడ్డగుట్ట, మే 29: మారేడుపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలను తీసుకోవాలని కోరుతూ మారేడ్‌పల్లి తహసీల్దార్ భీమయ్యగౌడ్‌కు సీపీఎం నాయకులు గురువారం వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రభుత్వ స్థలాలకు బోర్డు లేకపోవడం, కంచె ఏర్పాటు చేయకపోవడంతో కోట్లాది రూపాయల విలువ చేసే భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు తహసీల్దార్‌ను కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఎం సికింద్రాబాద్ నాయకులు అజయ్ బాబు, మల్లేష్, బాలయ్య, ఎల్లయ్య, ఫాతిమా, చారి పాల్గొన్నారు.

## యువతకు క్రీడా సామగ్రి అందజేత



క్రీడా సామగ్రి అందజేస్తున్న కార్పొరేటర్ హేమలత

బన్సీలాల్‌పేట్, మే 29: జీహెచ్‌ఎంసీ ద్వారా వివిధ బస్తీలకు చెందిన యువతకు మంజూరైన క్రీడా సామగ్రిని బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె.హేమలత అందజేశారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు, యువతను క్రీడల్లో ప్రోత్సహించడానికి సామగ్రిని పంపి ణీ చేశామన్నారు. బీఆర్ఎస్ నాయకుడు కె.లక్ష్మిపతి, జి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ బిల్ కలెక్టర్ చేతివాటం

బోడుప్పల్, మే 29: బోడుప్పల్ నగర పరిధిలోని రెండో డివిజన్ శ్రీమాతా అరవింద కాలనీకి చెందిన అనిల్ కుమార్ రెడ్డి ఆస్తి పన్ను రూ .10,500 మణికంఠ అనే బిల్ కలెక్టర్‌కు ఏడాది క్రితం చెల్లించారు. కానీ ఆస్తి పన్ను చెల్లింపు కానట్టు ఆన్‌లైన్‌లో రావడంతో కంగుతిని మున్సిపల్ కార్యాలయాన్ని గురువారం ఆశ్రయించారు. ఆస్తి పన్ను ఆన్‌లైన్‌లో జమ చేయాలని ఏడాదిగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదని ఆయన వాపోయారు. అయితే మణికంఠ బిల్ కలెక్టర్ చేతివాటం ప్రదర్శిస్తున్నాడనే ఫిర్యాదులు రావడంతో మూడు నెలల క్రితమే అతన్ని విధుల నుంచి తొలగించామని చెప్పి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో అనిల్‌కుమార్ రెడ్డి, మణికంఠ అనే వ్యక్తిపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రారంభం

ఉప్పల్, మే 29: ఉప్పల్ మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ గురువారం ప్రారంభించారు. మూడు రోజుల్లో అన్ని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తామని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు మండల కేంద్రానికి 90 శాతం రావడం జరిగిందని, అలాగే అన్ని పాఠశాలలకు ఏకరూప దుస్తులు కూడా పాఠశాలలు తెరిచేలోపు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రామారావు, ప్రధానోపాధ్యాయులు లక్ష్మిదేవి, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

## ట్యాక్స్ కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలి



సీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న సామాజిక కార్యకర్త సతీష్

మారేడ్‌పల్లి, మే 29: కంటోన్మెంట్ ప్రాంతంలో ప్రజా సమస్యలు పరిష్కరించేందు టోల్ ఫ్రీ సర్వీసులు, అలాగే ప్రతి వార్డు కమ్యూనిటీ హాల్‌లో ఇంటి పన్ను (ట్యాక్స్ కలెక్షన్) సెంటర్లను వెంటనే ఏర్పాటు చేయాలని బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌కు గురువారం బోర్డు కార్యాలయంలో సామాజిక కార్యకర్త తెలుకుంట సతీష్‌గుప్త వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంకేతిక కారణాల వల్ల పోర్టల్ స్తంభించిన విషయం అందరికి తెలిసిందే. అయితే కంటోన్మెంట్ ప్రాంత ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని బోర్డు సీఈఓ తెలిపారు. అదేవిధంగా త్వరలో బోర్డు పరిధిలో టోల్‌ఫ్రీ సర్వీసును అమలు చేస్తామని, దీంతో పాటు ప్రతి వార్డులో కమ్యూనిటీ హాళ్లల్లో ట్యాక్స్ కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని సీఈఓ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

## సీనియర్ సిటిజన్స్‌కు ఇబ్బందులు లేకుండా చేయాలి

మాదాపూర్, మే 29: చందానగర్ రైల్వే స్టేషన్‌లో వృద్ధులు, వికలాంగులు ఇటు, అటు దాటేందుకు ఇదివరకు లిఫ్ట్ ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చే యడం సంతోషంగా ఉందని హుడాకాల నీ సీనియర్ సిటిజన్స్ తరపున వి. ప్రభాకర్ రావు పేర్కొన్నారు. అలాగే.. రైల్వే స్టేషన్‌లో వృద్ధులు, వికలాంగులు లగేజీతో సులభంగా ఇవతలి వైపునుంచి అవతలి వైపు వెళ్లేటట్టుగా ఏర్పాట్లు చేయాలని గురువారం ఆయన.. జనరల్ మేనేజర్ సౌత్ సెంట్రల్ రైల్వేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హుడా కాలనీ, చందానగర్ రైల్వేస్టేషన్‌లో మెట్రో రైలులో ఏర్పా టు చేసినట్లు వృద్ధులు ఇవతలి నుంచి అ వతలికి సులభంగా లగేజీలతో ప్ర యాణం చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రస్తుతం వృద్ధులు, వికలాంగులు ఇటు నుంచి అటుగా లగేజీలతో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆయనతెలిపారు. ఇప్పటికైనా సీనియర్ సిటిజన్స్ ఇబ్బందులను గుర్తించి.. సమస్య ను పరిష్కరించాలని ఆయన కోరారు.

# చిన్నపాటి వర్షానికే నీట మునిగిన రహదారి



బోయిగూడలోని మేకలమండి ఎదురుగా నిలిచిన వరద నీరు

బన్సీలాల్‌పేట్, మే 29: బోయిగూడలోని మేకలమండి ఎదురుగా గాంధీనగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారి గురువారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికే చెరువులా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సుమారు రూ.19 లక్షల వ్యయంతో ఇటీవల నిర్మించిన వాననీటి కాల్వలో నుంచి వరద నీరు వెళ్లకపోవడం, వరద రోడ్డుపైనే నిలిచిపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది. ఇప్పటికైన జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి, సమస్యను శాశ్వతంగా పరిష్కారించాలని స్థానికులు కోరుతున్నారు.

## సిప్లాన్ ఫార్మా పరిశ్రమపై డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడులు

### రూ.3 లక్షల ఔషధ నిల్వలు స్వాధీనం



పట్టుబడిన ఔషధ నిల్వలతో నియంత్రణ మండలి అధికారులు

దుండిగల్, మే 29: డ్రగ్స్ కంట్రోల్ అడ్మిషన్ (ఔషధ నియంత్రణ మండలి) అధికారులు గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, ప్రగతినగర్ సమీపంలోని అలీఫ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న సిప్లాన్ డ్రగ్స్ అండ్ ఫార్మసూటికల్స్ లిమిటెడ్ పరిశ్రమ, యూనిట్–1 పై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన దాడుల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న వెటర్నరీ ఔషధాలను గుర్తించారు. సుమారు రూ.3లక్షల విలువచేసే ఆల్బెండజోల్ టాబ్లెట్స్ 250 ఎంజీ (వెటర్నరీ), 986 కేజీల ఆల్బెండజోల్ గ్రాన్యూయేల్స్ (వెటర్నరీ) నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. వీటికి బోలసెస్, గ్రాన్యూయేల్స్ లైసెన్స్ లేకుండానే తయారు చేయడంతోపాటు, మార్కెట్లో విక్రయాలు చేపడుతున్నట్లు తేలిందని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. ఈ దాడుల్లో డ్రగ్ కంట్రోల్ ఏడీ ప్రభాకర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, విక్రమ్, నవీన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పిద్దాం




శామీర్‌పేట్, మే 29: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమై న విద్యను పొందాలని మండల విద్యాధికారి కమలాకర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంపుదల కొరకు టీఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రచార జాతా గురువారం శామీర్ పేట్ మండలం తుంకుంట, శామీర్‌పేట్, తుర్కపల్లి గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జైసింహారెడ్డి, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ పత్రిక ప్రధాన సంపాదకులు మాణిక్‌రెడ్డి, ప్రచార జాతాలో జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు సత్యనారాయణ, దేవిజా నాయక్, గొడుగు శ్రీనివాస్, కుమార్, మండల అధ్యక్షులు తిరుమలేష్, ప్రధాన కార్యదర్శి కుమార్ పాల్గొన్నారు.

## రెండో దశ దోస్త్ రిజిస్ట్రేషన్లు...

ఉప్పల్, మే 29: ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం దోస్త్ 2025 ద్వారా రెండో దశ రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు మే 30 నుంచి జూన్ 8వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డా. విజయ్ కుమార్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంపీసీఎస్, బీజెడ్సీ మొదలైన కోర్సులు అందుబాటులో ఉన్నాయని, వెబ్ ఆప్షన్‌లో ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మొదటి ఫేజ్‌లో కళాశాలలో సీటు పొందిన విద్యార్థులు, కళాశాలలో చేరే ఆసక్తి గల విద్యార్థులు ఉప్పల్ కూరగాయల మార్కెట్ వద్ద గల కళాశాల కార్యాలయంలో సంప్రదించగలరని దోస్త్/అడ్మిషన్ల సమన్వయ కర్త జె. విశ్వనాథ్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. కళాశాల సిబ్బందిని 89859 27019 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

## తల్లి, కూతురు అదృశ్యం

బాలానగర్, మే 29: తల్లి, కూతురు అదృశ్యమైన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరసింహారాజు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధి, రంగారెడ్డినగర్‌లో నివాసం ఉండే సీత (21) తన మూడేళ్ల కుమార్తె జాహ్నవిని తీసుకొని బుధవారం ఉదయం 9 గంటలకు డ్యూటీకి అని వెళ్లి.. తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు మొత్తం గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## బాలానగర్‌లో పుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

బాలానగర్, మే 29 : బాలానగర్ ఫ్లైఓవర్ వద్ద పుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఆయన.. మూసాపేటలోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని దాసరి బస్తీలో కమ్యూనిటీ హాల్, దిల్‌కుష్‌నగర్‌లో వరదనీటి పైప్‌లైన్, అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టాలని కోరారు. బాలానగర్ ఫ్లైఓవర్ వద్ద ప్రమాదాల నివారణకు పుటోవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు.

## గంధం చెట్లు నరికి చోరీ

వెంగళరావునగర్, మే 29: కేంద్ర ప్రభుత్వ సంస్థకు చెందిన నిమ్స్ మే (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ ప్రాంగణంలో ఉన్న గంధం చెట్లను నరుక్కుని అపహరించుకెళ్లారు దొంగలు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం రహ్మత్ నగర్ లోని నిమ్స్ మే ప్రాంగణంలోకి గురువారం అర్ధరాత్రి దాటాక 2.15 గంటలు సమయంలో ఓ దొంగ 3 గంధం చెట్లను నరుక్కుని అపహరించుకెళ్లాడు. అకౌంటెంట్ శ్రీనివాస్ వర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా సమస్యలే ఎజెండాగా పోరాటాలు

జవహర్‌నగర్, మే 29: ప్రజా సమస్యలే ఎజెండాగా పోరాటాలు చేయాలని, ఎర్రజెండా పేదలకు అండగా నిలుస్తుందని సీపీఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. జవహర్‌నగర్‌కు చెందిన క్రాంతి కళాబృందం వ్యవస్థాపకుడు వెంకటాచారి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యదర్శి ఉమా మహేష్‌ను కలిసి చర్చించారు.